ఈ వారం తెలుగు పుస్తకం

# సాంఘిక చరిత్రకు నవలారూపం-'కాలరేఖలు'

-గజానన్ తామన్




Author : Ampasayya Naveen
Subject : NOVELS
Year of Publication : 2002
Price : USD $ 4.16

అంపశయ్య నవీన్ 1996లో పదవీవిరమణ చేసే నాటికి నవలాకారునిగా తెలుగు సాహిత్యంలో తన స్థానాన్ని సుప్రతిష్ఠితం చేసుకున్నాడు. 'కాలరేఖలు' నవల 'ప్రవేశిక'లో ఆయన చెప్పుకున్నట్లు 1996 నుండి 2001 వరకు రాత్రింబవళ్ళు శ్రమించి 1944 నుండి 1994 వరకు - అంటే ఓ యాభై సంవత్సరాల కాలాన్ని తీసుకొని, ఆ కాలఖండంలో తెలంగాణా జన జీవనాన్ని చిత్రించే నవలాత్రయాన్ని సృజించారు. ఈ చారిత్రాత్మక నవలాత్రయాన్ని రచించడానికి ఆయన ఆనాటి తెలంగాణ రైతాంగ పోరాటానికి కేంద్రాలయిన ఎన్నో గ్రామాలను సందర్శించారు. ఎంతో సమాచారాన్ని సేకరించారు.

ఈ నవలాత్రయంలోని మొదటి నవల 'కాలరేఖలు'. మిగిలిన రెండు నవలలు "చెదిరిన స్వప్నాలు", "బాంధవ్యాలు". 'కాలరేఖలు' 2004వ సంవత్సరానికి గాను కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారాన్ని గెలుచుకున్న నవల. సాహిత్యంలో అత్యున్నత పురస్కారంగా భావించబడే ఈ పురస్కారాన్ని ఇదివరకు కేవలం రెండు తెలుగు నవలలు మాత్రమే గెల్చుకున్నాయి. (అవి గోపీచంద్ రచించిన "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" 1961, మాలతీ చందూర్ రచించిన "హృదయనేత్రి" 1985). ఈ గౌరవాన్ని దక్కించుకున్న నవలల్లో "కాలరేఖలు" మూడవది.

నవలను చదివి ఆనందించటానికి అపార వైదుష్యం అక్కరలేదు. సామాన్యపాఠకుల స్పందనలు ఉపేక్షణీయాలు కావు. డా॥ జాన్సన్ అంతటి వాడు కృతి యొక్క ఉత్కృష్టతను నిర్ధారించడాన్ని సామాన్య పాఠకుని అంతిమ నిర్ణయానికే వదిలి వేయాలన్నాడు. ఈ నవలాత్రయాన్ని ఏక కాలంలో స్పృశించడం వల్ల ఏ ఒక్కదానికీ సంపూర్ణన్యాయం చేకూర్చడం సాధ్యం కాదు గనుక నన్ను నేను 'కాలరేఖలు' నవలకే పరిమితం చేసుకుంటున్నాను.

నవలాకారుడిగా నవీన్ ఆర్జించిన లోకప్రియతను గురించి మాట్లాడుకోవడం చర్వితచర్వణమే అవుతుంది. అవార్డులకంటె, రివార్డులకంటె పాఠకుల ఆదరణ రచయితకు కొండంత మనోబలాన్ని ఇస్తుంది. యశోవిభూషితుణ్ణి

చేస్తుంది. కళాత్మక సంకేతాల మాట ఎలా ఉన్నా నవీన్ లేఖిని నుండి జాలువారిన ప్రతి నవల ఏకబిగిన పాఠకుణ్ణి చదివింపజేస్తుంది. రచనకుండాల్సిన ప్రాథమిక లక్షణం ఇదే. నవీన్ నవలలు కేవలం మనోవినోదం కూర్చే రచనలు కావు. అతీతాన్ని సమగ్రంగా మనముందు నిలుపుతాయి. అతీతాన్ని విస్మరించే ఏ మానవ సమూహం ఉజ్వల భవిష్యత్తుకు నోచుకోలేదు. లోకప్రియతనే కాక వస్తుగాంభీర్యాన్ని నికషంగా ఎంచి చూస్తే నవీన్ వంటి నవలా కారులు ఏ దేశసాహిత్యంలోనైనా అరుదనే చెప్పాలి.

గత శతాబ్దంలోనూ, ఇప్పుడూ పుంఖానుపుంఖంగా వెలువడుతున్న నవలల్ని "రొమాన్స్" (Romance) అనే సాహిత్య ప్రక్రియకు చెందిన రచనలనే చెప్పాలి. ఇవి పగటికలలకు ఇచ్చిన శబ్దరూపాలు. మధ్యమ వర్గీయ యువ యువతీజన మనోరంజకాలు. ఇవి చదవడం వల్ల కాలహరణమే తప్ప ఏ ప్రయోజనమూ పఠితకు సిద్ధించదు.

నవీన్ 'కాలరేఖలు' నవల యాతనామయ తెలంగాణా జనజీవన యాథాతథ్యానికి స్వచ్ఛమైన దర్పణం. మహాకవి దాశరథి చెప్పినట్టు "తెలంగాణా కోటి రత్నాల వీణ". చివరి నిజాం నవాబు తీగలను తెంపి అగ్నిలో దించాడు. ఎన్నాళ్ళుగానో తెలంగాణా నేల బీటలు వారుతుండటం కాదనలేని కఠోరసత్యం.

నవీన్ నవలా శిల్పంలో ఒక వైశిష్ట్యం ఉంది. అది కాలరేఖలు నవల కథా కథనంలో ఆయన ప్రదర్శించిన తటస్థత. రచయిత చొరబాటు (Authorial Intrusion) ఆయన రచనల్లో మచ్చుకైనా కనిపించదు. రాజకీయ సైద్ధాంతిక సులోచనాలతో వర్తమానేతిహాసాన్ని విలోకించడం నవీన్ చెయ్యలేదు.

ఒక ఇతిహాసానికుండే విస్తృత పరిధి 'కాలరేఖలు' కుంది. చరిత్రలో జరిగిన కొన్ని వాస్తవ సంఘటనల్ని నేపథ్యంగా తీసుకుని ఒకానొక చారిత్రకయుగంలో జీవించిన అనేక వర్గాల ప్రజల సామాజిక జీవితాల్నీ, వాళ్ళ సంప్రదాయాల్నీ, ఆచార వ్యవహారాల్నీ, మానవ సంబంధాల్నీ కళ్ళకు కట్టినట్టు చిత్రించడమే ఇతిహాస రచన ప్రధానలక్షణం. అలాంటి ఒక ఇతిహాస రచనగా 'కాలరేఖలు' నవల కలకాలం తెలుగు నవలా సాహిత్యంలో నిలిచిపోతుంది.

'కాలరేఖలు' నవలలో కథ చెప్పడంలో నవీన్ నాటకీయ శిల్పాన్ని అనుసరించాడు. కథనంలో ఎక్కడా నవీన్ రచయితగా తన అభిప్రాయాలను ఉటంకించలేదు. తన అభిప్రాయాలను సమర్థించుకునే విధంగా సంఘటనల్నీ, పాత్రల్నీ మలచలేదు. పాత్రలు ఆయా సన్నివేశాలలో ఆయా విషయాలను గురించి ఘర్షిస్తాయే తప్ప ఎక్కడా లాలూచీ పడవు. చరిత్రలో యథార్థంగా జరిగిన సంఘటనల ఆధారంగా సామాన్య జన జీవితాన్ని అత్యంత వాస్తవికతతో పాఠకుని ముందుంచే క్రమంలో రచయిత చూపిన సంయమం ఎంతో మెచ్చుకోదగింది. ఏ సిద్ధాంతరాద్ధాంతాలకు గానీ, నవలలోని ఏ పాత్ర వైపుగానీ ప్రత్యేకించి మొగ్గు చూపకుండా రచయిత సమతూకంగా, నిష్పక్షపాతంగా రచనను సాగించడం వల్ల ఆయా సిద్ధాంతాల, పాత్రల జీవన దృక్పథాలు, మనస్తత్వాల మంచి చెడ్డలను స్వయంగా పాఠకుడే బేరీజు వేసుకోవాల్సి ఉంటుంది. చారిత్రక వాస్తవికత నవలలో ఎక్కడా కాల్పనిక వాస్తవికతకు బలికాదు. కథ చెప్పడంలో రచయిత పాటించిన ఈ తటస్థత ఈ నవలనో గొప్ప నవలగా రూపొందించింది.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని నేపథ్యంగా తీసుకుని ఇదివరకు తెలుగులో చాలా నవలలే వెలువడ్డాయి. కాని ఆ నవలల్లో ఏదో ఒక సిద్ధాంతాన్నో, లేక ఆ పోరాటానికి సంబంధించిన యేదో ఒక పార్శ్వాన్ని మాత్రమే ఉదాత్తీకరిస్తూ చిత్రించడం జరిగింది - కాని 'కాలరేఖలు' నవలలో ఆనాటి పోరాటానికి సంబంధించిన అన్ని పార్శ్వాలను స్పృశించడం, కథ చెప్పడంలో మూడో వ్యక్తి దృష్టికోణాన్ని అనుసరించడం, అంటే రచయిత తటస్థుడిగా ఉండిపోవడం అనే శిల్పాన్ని ఈ నవలలో నవీన్ సమర్థవంతంగా పోషించాడు. ఓ రచయిత తను సృష్టిస్తున్న పాత్రలపట్ల, తను చిత్రిస్తున్న జీవితం

పట్ల ఇంత నిష్పక్షపాతంగా వ్యవహరించగల్గటం ఋషి అయిన వాడికే సాధ్యమౌతుంది. అందుకే మన పూర్వులు "నాన్నృషి కురుతే కావ్యం" అన్నారు. అలాంటి ఋషిత్వం నాకీ నవలలో కనిపించింది. ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత 'కామూ' రచయితకు తన రచన పట్ల నిబద్ధత ఉండాలని చెప్పింది ఈ ఉద్దేశ్యంతోనే.

కథాంశానికికొస్తే, కాలరేఖల్లో స్థూలంగా కథ ఇదీ :

నవలలో ప్రధాన పాత్ర రాజు. అతని దృష్టికోణం నుంచే కథంతా నడుస్తుంది. రాజు తండ్రి నర్సయ్య. చిన్నాయన సత్తెయ్య. వాళ్ళదో పెద్ద ఉమ్మడి కుటుంబం. వ్యవసాయం వాళ్ళ వృత్తి. నర్సయ్య, సత్తెయ్య ఒక సిద్ధాంతానికి సంబంధించిన రెండు పార్శ్వాలకు ప్రతినిధులు. 1944లో జరిగిన పదకొండో ఆంధ్రమహాసభలో ఇద్దరూ పాల్గొంటారు. ఈ పదకొండో ఆంధ్ర మహాసభకు కమ్యూనిస్టు నాయకుడు రావి నారాయణరెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికవుతాడు. అంతకు ముందు మితవాదుల చేతుల్లో ఉన్న ఆంధ్రమహాసభ 1944లో అతివాదులు - అంటే కమ్యూనిస్టుల చేతుల్లో పడింది. దాంతో దొరల, దేశముఖుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిమ్నవర్గాలవారు, చిన్న రైతులు, మధ్యతరగతి రైతులు ప్రారంభించిన పోరాటం ఉధృతరూపాన్ని ధరించింది. ఆంధ్రమహాసభను ఆనాటి గ్రామీణులు "సంగం" అంటుండేవాళ్ళు. బడా భూస్వాములు - అంటే ఒకవైపు దొరలకు, దేశముఖులకు - మరోవైపు తాడితులు, పీడితులకు - ఈ రెండు వర్గాల మధ్య సాగిన పోరాటాన్నే ఈ నవల చిత్రిస్తుంది. ఆంధ్రమహాసభలో ఉత్సాహంగా పాల్గొన్న నర్సయ్య, సత్తెయ్యల కోసం పోలీసులు వెతుకుతారు. నర్సయ్య దొరను ఆశ్రయించి అరెస్టును తప్పించుకుంటాడు. కానీ సత్యం (సత్తెయ్య) సాయుధపోరాటానికి తనను తాను పూర్తిగా అర్పించుకుంటాడు. ఆగస్టు 15, 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం రావడంతో ఈ పోరాటం మరో మలుపు తిరుగుతుంది. హైదరాబాద్ సంస్థానాన్ని పరిపాలిస్తున్న ఏడో నిజాం రాజు - మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసేది లేదని ప్రకటిస్తాడు. స్వతంత్రంగా ఉంటానంటాడు. ఈ కారణం వల్ల యావత్ భారతదేశానికి స్వతంత్రం వచ్చినా హైదరాబాద్ సంస్థానంలోని ప్రధాన భాగమైన తెలంగాణాకు స్వాతంత్ర్యం రాలేదు. ఖాసింరజ్వీ నాయకత్వంలో రజాకార్లు అనే ముస్లిం మతోన్మాదులు తెలంగాణా గ్రామాల మీద దాడి చేసి ప్రజల్ని ఊచకోత కోశారు. స్త్రీలను చెరచారు. హిందూ మెజారిటీ రాష్ట్రంలో ఉన్న హైదరాబాద్‌ను ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా మార్చాలన్నది రజాకార్ల లక్ష్యం. ఈ రజాకార్లనే రాక్షస మూకల బారినుండి ప్రజల్ని కాపాడవలసిన బాధ్యతను కూడా ఆంధ్రమహాసభ నాయకత్వం తన నెత్తిమీద వేసుకున్నది. సత్యం కోసం రజాకార్లు కూడా గాలిస్తారు. అతని కుటుంబాన్ని హింసిస్తారు. ఆ కుటుంబంలోని స్త్రీలు వడిసెలతో, కారంసంచులతో, రోకలిబండలతో రజాకార్లను ఎదుర్కొంటారు. రజాకార్లు సాగిస్తున్న ఈ బీభత్సానికి తట్టుకోలేక సత్యం కుటుంబం కృష్ణాజిల్లాలోని బందరుకు వలసపోతుంది. తెలంగాణా ప్రాంతానికీ, ఆంధ్ర ప్రాంతానికీ మధ్య ఉన్న సాంస్కృతిక వ్యత్యాసాలను జీవన విధానాన్ని రచయిత ఇక్కడ చిత్రిస్తాడు. కొంత కాలం సత్యం కుటుంబం బందరులో గడిపాక తిరిగి వాళ్ళ స్వగ్రామం చేరుకుంటుంది. రజాకార్లు బైరాన్‌పల్లి అనే గ్రామం మీద పెద్ద ఎత్తున దాడి చేసి ఒకే రోజు వందమంది యువకులను కాల్చి చంపేస్తారు. సెప్టెంబర్ 1948లో భారతప్రభుత్వం హైదరాబాద్ సంస్థానంలోకి సైన్యాన్ని పంపించింది. దీనినే చరిత్రలో 'పోలీసుయాక్షన్' అన్నారు. ఏడో నిజాంరాజు సైన్యం భారత సైన్యానికి లొంగిపోయింది. సెప్టెంబర్ 17, 1948నాడు హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేస్తారు. దీంతో కమ్యూనిస్టు పార్టీ జరుపుతున్న సాయుధ పోరాటాన్ని విరమించాలని కొందరు ఆ పార్టీ నాయకులే సూచించారు. కానీ కమ్యూనిస్టు ఆ పార్టీ నాయకత్వం సాయుధపోరాటాన్ని 1951దాకా కొనసాగించింది. ఆ తర్వాత సాయుధపోరాటాన్ని విరమించి 1952లో జరిగిన

సార్వత్రిక ఎన్నికల్లో పీ.డి.ఎఫ్ పేరుతో (పీపుల్స్ డెమొక్రాటిక్ ఫ్రంట్) కమ్యూనిస్టు పార్టీ పాల్గొన్నది. తెలంగాణ ప్రజలు కమ్యూనిస్టు పార్టీ నిలబెట్టిన అభ్యర్థులనే గెలిపించారు. 1952లో ముల్కీరూల్స్‌ని అంటే తెలంగాణ స్థానికులకే ఉద్యోగాలివ్వాలన్న నిజాం నవాబుగారి జీవోను అమలు పరచడంలో జరుగుతున్న అవకతవకల్ని సరిచెయ్యాలన్న ఉద్యమం చెలరేగింది. ఆ తర్వాత 1956లో పెద్ద మనుషుల ఒప్పందాన్ని ఖరారు చేసుకొని భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలన్న కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగంగా తెలంగాణా జిల్లాలను ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేసి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఇలా 1944లో ప్రారంభమైన 'కాలరేఖలు' నవల 1956లో తెలుగు మాట్లాడే ప్రజలంతా ఒక రాష్ట్రంగా ఏర్పడటంతో ముగుస్తుంది.

పన్నెండేళ్ళను కథా కాలంగా తీసుకున్న ఈ నవలలో రాజు (రాజయ్య) ప్రధానపాత్ర. నవలంతా అతని దృక్కోణంలోంచే సాగుతుంది. నవల ప్రారంభంలో అతని వయస్సు నాలుగేళ్ళు. నవల పూర్తయ్యేటప్పటికి అతడు పదహారేళ్ళ నవయువకుడుగా మన ముందు నిలుస్తాడు. అలా రాజు అక్షరాభ్యాసంతో ప్రారంభమైన ఈ నవల అతడు మెట్రిక్యులేషన్ పరీక్ష రాయడంతో పూర్తవుతుంది. ఇలా ఈ నవల పైకి ఓ వ్యక్తి సాగించిన జీవితయాత్రలా కనిపించినా నిజానికిది నవలా రూపంలో సాగిన సామాజిక చరిత్ర. ఈ నవలలో కొన్ని వందల పాత్రలున్నాయి. ఐదారు కుటుంబాలున్నాయి. ఆనాటి పోరాటానికి కేంద్రాలయిన ఎన్నో గ్రామాలున్నాయి.

ఈ నవలో ప్రధాన పాత్రయిన రాజు బాల్యంలోంచి ఆరంభయౌవనంలోకి ప్రవేశించే క్రమంలో అతడు పొందిన మేధోవికాసాన్ని చిత్రించిన తీరు అత్యంత వాస్తవికంగా ఉంది. తన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు సాక్షీభూతుడుగా ఉన్న రాజు ఆ సంఘటనల నుండి యేం నేర్చుకున్నాడో ఈ నవల చిత్రిస్తుంది. చదువుకోవడం ద్వారా క్రమంగా అతని చైతన్య పరిధి ఎలా విస్తరించిందో ఈ నవల మనకు చూపిస్తుంది. బాల్యంలోనే రాజులో మొగ్గగా ఉన్న రచయిత క్రమంగా ఎలా వికసించాడో ఈ నవలలో చిత్రించిన పద్ధతి అద్భుతంగా ఉంది. భవిష్యత్తులో రాజు ఒక కళాకారుడుగా రూపొందబోతున్నాడన్న సూచనల్ని రచయిత చిత్రించిన విధానం ఎంతో హృద్యంగా ఉంది. రాజు కళ్ళలోంచే ఈ నవలలోని అనేక దృశ్యాల్ని, సంఘటనల్ని రచయిత మనకు అలవోకగా చూపిస్తాడు. బాల్యం నుండి యౌవనం వరకు ఓ కళాకారుడు సాగించిన ప్రస్థానంగా కూడా ఈ నవలను అభివర్ణించవచ్చు.

ఈ నవలలో నవీన్ వాడిన భాషను గూర్చి రెండు మాటలు చెప్పాలి. ఈ నవలలోని సంభాషణలన్నీ తెలంగాణా మాండలికంలో సాగుతాయి. కథా రచన (Narration) మాత్రం శిష్ట వ్యావహారికంలో సాగుతుంది. సంభాషణల్లో వాడబడిన తెలంగాణ మాండలికం కూడా చాలా సరళంగా ఉంటుంది. పాత్రోచిత సంభాషణల వరకే మాండలికాన్ని పరిమితం చెయ్యడం వల్ల తెలుగువాళ్ళందరూ ఈ నవలను చదివి ఆనందించే అవకాశం కల్గింది.

ఈ నవలలోని మరో గొప్ప అంశం : ఆ నాటికీ, ఈ నాటికీ మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఎన్నో మూఢనమ్మకాల్ని చిత్రిస్తూ, ఈ నవలలోని కథా నాయకుడు రాజు ఆ మూఢ నమ్మకాల్ని అనుక్షణం ప్రశ్నిస్తూ, ఖండిస్తూ తనలో శాస్త్రీయ దృక్పథాన్ని ఎలా పెంచుకున్నాడో చూపించడం. ప్రతిదాన్ని పెద్దలు చెప్పారని గుడ్డిగా నమ్మడం కాకుండా వాటిలోని నిజానిజాల్ని స్వానుభవంతో తెలుసుకోవాలని ఈ నవలలోని రాజు పాత్ర ద్వారా రచయిత ఉద్బోధించాడు. రాజులో బాల్యం నుండే శాస్త్రీయ దృక్పథం ఏర్పడే క్రమాన్ని రచయిత ఎంతో మెలకువతో సూక్ష్మదృష్టితో చిత్రించడం చాలా గొప్పగా ఉంది. చిన్నపిల్లలు కూడా ఈ నవల చదివి తమలో శాస్త్రీయ దృక్పథాన్ని ఏర్పరచుకునే అవకాశం ఉంది.

'కాలరేఖలు' నవలలో మనకు అడుగడుగునా కనిపించే మరో అంశం ప్రాంతీయత లేక ప్రాదేశికత (Provinciality)

ఇది నిందార్థం కాదు. ఏ సాహిత్యానికైనా ఉండాల్సిన గొప్పగుణం. ఎక్కడా ఎప్పుడూ కనిపించని పాత్రలను ప్రవేశపెట్టేవాడు గొప్ప నవలాకారుడనిపించుకోడు. కృతిశ్రేష్ఠతను నిర్ధారించేది రచయిత నిజాయితి. ఈ నిజాయితి 'కాలరేఖలు'లో పుష్కలంగా ఉంది. తనకు తెలియని ప్రాంతాన్ని గానీ, వాతావరణాన్నిగానీ రచయిత చిత్రించే ప్రయత్నం చెయ్యలేదు.

"ది ఓల్డ్‌మ్యాన్ అండ్ ద సీ" అనే హెమింగ్వే నవలలోని పాత్రలు వాస్తవికమైనవి కావని, ఘటనాక్రమం వాస్తవదూరమైనదని, భావాలు హృదయాంతరాళం నుండి ఉప్పొంగి వచ్చినవి కావని విమర్శకులు తప్పపట్టిన దాఖలాలున్నాయి. నవీన్ నవలల్లోని పాత్రలు, సన్నివేశాలు అంతర్లీనంగా ప్రవహించే భావధార, కృత్రిమమని (Fake) అనడానికి ఎవరూ సాహసించరని నా ప్రగాఢ విశ్వాసం. ఈ నవలలోని రాజు, సుశీల, నర్సయ్య, రాధమ్మ, సత్యం, రుక్కమ్మ, సత్తెమ్మత్త, సోమయ్య, శేఖర్ మొదలైన ఎన్నో పాత్రలు ఎంతో సజీవమైనవిగా, సహజమైనవిగా మనకు కనిపిస్తాయి. ఈ నవలలోని స్త్రీ పాత్రలు - రాధమ్మ, సత్తెమ్మత్త, ప్రమీల, సుశీల; రుక్కమ్మ, పార్వతమ్మ మొదలైన వాళ్లు మమూలు గృహిణులుగా ఉంటూనే అనాటి పోరాటంలో ఎలా వీరోచితంగా పాల్గొన్నారో, రజాకార్లలాంటి ముష్కరుల నుండి తమనుతాము ఎలా రక్షించుకున్నారో చిత్రించిన తీరు ఈనాటి స్త్రీలకు ఎంతో కనువిప్పుగా ఉంటుంది.

ఇతర సాహితీ ప్రక్రియలకంటే నవల మానవ జీవితానికి అత్యంత చేరువగా వచ్చే ప్రక్రియ. ఈ ప్రక్రియలో కృత్రిమత్వానికి రవ్వంతైనా చోటు లేదు. అపారమైన శబ్ద వైభవంతో తిమ్మిని బమ్మిని చేయడానికి వెసలుబాటు కల్పించనిది. సత్యం యెడ, సమాజ శ్రేయస్సు యెడ అకుంఠిత నిబద్ధతకలది. మానవ పరిసరాలను సూక్ష్మంగా పరిశీలించే సామర్థ్యం కలది. నవల మూలాలు అనుభవవాదం (Empiricism)లో ఉన్నాయి.

రాగాలనంతాలైనట్టే నవలారూపాలు కూడా అనంతాలు. టి.ఎస్. ఎలియట్ చెప్పినట్లు ప్రతిజాతికి తనదైన సృజనాత్మక, విమర్శనాత్మక మనోవిన్యాసం ఉంటుంది. నవలను సైతం సంస్కృతీ విశేషంగానే (Culture Specific) చెప్పకోవాలి. ఫ్రెంచ్ నవల తాత్విక భూమికకు ప్రతీకాత్మకరూపం. 'కామూ' నవల "ప్లేగ్" ఇందుకు ఉదాహరణగా చెప్పొచ్చు. ఫ్రెంచ్ నవల వంటిదే రష్యన్ నవల. ఆంగ్లనవల ఇందుకు పూర్తిగా విభిన్నమైనది. నేలను విడిచి సాము చేసే గుణం ఆంగ్లనవలకు లేదు. నవీన్ నవల 'కాలరేఖలు' ఆంగ్లనవలల సంప్రదాయాన్నే పుణికి పుచ్చుకున్నదని చెప్పొచ్చు. తాత్వికభూమిక కంటె యథార్థాన్ని చిత్రించడమే ఈ నవల లక్ష్యం.

భారతీయ సాహిత్యంలో అసలుసిసలైన నవల ప్రాదుర్భవించలేదని సర్దార్‌కుష్వంత్ సింగ్ కొన్నేళ్ళ క్రితం సెలవిచ్చాడు. భారతీయ పాఠకుల మనస్సులపై చెరగని ముద్రవేసిన మున్షీ ప్రేమ్‌చంద్, శరత్ బాబు, పురుషోత్తంరేగే, ముల్క్‌రాజ్ ఆనంద్ మొదలైన నవలాకారులు కుష్వంత్ సింగ్ గుర్తింపుకు అర్హులు కాకపోవడం నవలా విమర్శాప్రస్థానంలో ఒక విషాదఘటన.

కుష్వంత్‌సింగ్ ఈ 'కాలరేఖలు' నవల చదివితే తన అభిప్రాయాన్ని మార్చుకుంటాడని నా నమ్మకం.

సాహిత్య ప్రక్రియగా నవల అంతరిస్తుందని గతశతాబ్దంలోనే కొందరు మేధావులు జోస్యం చెప్పారు. ఈ భూమిపై మానవుడి మనుగడ కొనసాగినంత కాలం నవల సజీవంగా ఉంటుంది. మన వ్యక్తిత్వ వికాసానికి నవల ప్రేరకమయినట్టుగా మరేదీ కాదు. మనల్ని అంతర్ముఖుల్ని చేసి సామరస్య భావనతో మనుగడ సాగించేలా 'కాలరేఖలు' లాంటి నవలలు చేస్తాయి. కాబట్టి మంచి నవలలకు మరణం లేదని మన మేధావులు గుర్తించాలి.

ఈ సందర్భంలో నవలను గురించి డి.హెచ్. లారెన్స్ చెప్పింది గుర్తుచేసుకోవడం ఎంతైనా అవసరం.

"తత్వవేత్త వస్తుతత్వాన్ని విశ్లేషిస్తాడు. మతాచార్యుడు స్వర్గధామాల్ని గూర్చి గోరంతలు కొండంతలు చేస్తాడు. వైజ్ఞానికుని దృష్టిలో మానవదేహం కతిపయ వ్యవస్థల సంఘాతం. వీళ్ళందరిదీ పాక్షిక దృష్టి. కానీ నవలా కారుడిది సమగ్ర దృష్టి. నవల తేజోవంతమైన బతుకు పుస్తకం కాబట్టి వీళ్లందరికంటే నవలాకారుడుగా నేను గొప్పవాణ్ణి" అన్నాడు లారెన్స్ "Why the Novel matters" అన్న వ్యాసంలో.

సమగ్ర జీవన దర్శనం నవలలోనే కల్గుతుంది అన్న లారెన్స్ మాటను అక్షరాలా నిజం చేసిన నవల "కాలరేఖలు".

పోయిన యాభై ఏండ్ల (1944-1994) తెలంగాణా జన జీవనంలో ఉత్పన్నమైన ఆర్థిక సామాజిక, రాజకీయ పరివర్తనను సూక్ష్మాతి సూక్ష్మంగా చిత్రీకరించిన నవలాకారుల్లో ప్రథమస్మరణీయుడు నవీన్. ఆయన నవలలో కొత్తదనం ఉంది. యథార్థం ఉంది. రచయితకు ఇష్టమైనదాన్ని ఉదాత్తీకరించే ప్రయత్నం ఎక్కడా జరగలేదు. రంగులద్ది అలరించే ప్రయత్నమూ జరగలేదు.

నవీన్ ఇటీవలి నవలాత్రయాన్ని - "కాలరేఖలు", "చెదిరిన స్వప్నాలు", "బాంధవ్యాలు" చదివిన పాఠకులకు వెంటనే గుర్తుకు వచ్చే పాశ్చాత్య నవలా కారుడెవరు? 'కామూ' గానీ "సార్త్రే"గానీ కారు- వీరు తాత్త్వికతను నవలల్లో జోడించిన నవలాకారులు. జర్మన్ నవలాకారుడు "కాఫ్కా"నా? కాదు మరెవరు? నా సమాధానం అమెరికాలోని చికాగో నగరాన్ని యావజ్జీవితం కార్యక్షేత్రంగా ఎంచుకున్న అమెరికన్ నవలాకారుడు "సాల్‌బెలో" (Seul Bellow). (నోబెల్ పురస్కార గ్రహీత సాల్‌బెలో ఇటీవలనే మరణించాడు).

సాల్‌బెలో తనను తాను సామాజిక చరిత్ర కారునిగా (Social Historian) ప్రకటించుకున్నాడు. సమకాలీన సాహిత్య సృజన సిద్ధాంతాలకు, ఉద్యమాలకు అతీతుడుగా ఉంటూ తనదైన ఫక్కీలో రచనలు సాగించాడు. ఒక సందర్భంలో అతడన్న మాట నవీన్‌కు అక్షరాలా వర్తిస్తుంది.

"నాకు దృశ్యమానమవుతున్న దాన్ని అధిగమించను. చరిత్రకారునివలె నేను సైతం సందర్భనిబద్ధుణ్ణి" *

'సాల్‌బెలో'కు చికాగో ఎలాగో నవీన్‌కు అతని స్వగ్రామం, అప్పటి నల్లగొండజిల్లాలోని వావిలాల, దాని పరిసరాలు అలాగ.

నాటి తెలంగాణాలో సమాజం నాలుగు వర్గాలుగా చీలింది. 1. భూస్వామ్య వర్గం - అంటే అగ్రవర్ణంలేక పాలకవర్గం, 2. సన్నకారురైతులు, 3. వృత్తిపని వాళ్ళు మరియు భూమిహీనులు, 4. వెట్టిచాకిరీ చేస్తూ సర్కారువారి మరియు దొరల దౌర్జన్యాలకు గురిఅయిన దళితులు. నాటి హైదరాబాద్ సంస్థానంలోని తెలంగాణా ఒక బృహద్విశ్వమైతే అప్పటి నల్గొండ జిల్లాలోని వావిలాల దాని పరిసరగ్రామాలైన పాలకుర్తి, కడివెండి, దేవరుప్ల మొదలైనవి లఘువిశ్వాలన్నమాట. పై గ్రామాలతో పాటే ప్రత్యేకంగా పేర్కొనదగిన గ్రామం విస్నూరు. విస్నూరు దొరవారి కుమారుడు బాపుదొర సాగించిన దురాగతాలు "కాలరేఖలు" నవలలో విస్తృతంగా చిత్రించబడ్డాయి.

1944లో పదకొండవ ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లాలోని బోనగిరిలో జరగనుంది. జనసేకరణ నిమిత్తం రావినారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి కథానాయకుడైన రాజు గ్రామానికి - అంటే వాయిల్పాడుకు రావడం, పదకొండు జతల ఎడ్లను కట్టిన బండిలో (పదకొండవ ఆంధ్రమహాసభకు సంకేతంగా) ఊరేగింపు తీయడం, ఎన్నో ఏళ్ళుగా నిద్రాణంగా ఉన్న తెలంగాణ పల్లె వాయిల్పాడులోని (వావిలాల గ్రామమే నవలలో వాయిల్పాడయ్యింది) మట్టికి ఈ నాయకుల రాకతో చైతన్యస్పర్శ కల్గటం - 'కాలరేఖలు' నవలకు ఇది ప్రారంభం. జనంలో ఉత్సాహం ఉరకలు

* "I can't exceed what I see. I am bound by the situation I live in"

వేస్తోంటే ఆడుతూ, పాడుతూ, జైకొడ్తూ ఊరేగింపు ముందుకు సాగిపోతున్నది. ఈ దృశ్యాన్ని చదువుతుంటే ఆనాటి ఆ ఊరేగింపులో మనమూ పాల్గొన్నట్టుగా అనుభూతి చెందుతాం. అన్యాయానికీ, శోషణకూ, స్వేచ్ఛారాహిత్యానికి విరుద్ధంగా పోరాడుతూ అసువులు బాసిన వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నట్టుగా ఫీలౌతాం. వాళ్ళ త్యాగఫలితంగానే మన బతుకులు కాస్తో కూస్తో చక్కబడ్డాయన్న జ్ఞానోదయం మనకు కల్గుతుంది.

ఈ ఊరేగింపులో పాల్గొంటున్న పసిపిల్లలు రాజునూ, సుశీలనూ చూస్తోంటే ప్రఖ్యాత సినిమా "పథేర్‌పాంచాలి" లోని అక్కాతమ్ముడు అపూ, దుర్గలు గుర్తొస్తారు. "పథేర్ పాంచాలి" నవలలోనూ ఆ నవల ఆధారంగా అదేపేరుతో సత్యజిత్‌రే నిర్మించిన "ఫథేర్ పాంచాలి" సినిమాలోనూ అపూ, దుర్గలు మొదటిసారి రైలుబండిని చూసినప్పుడు ఎలాంటి ఉత్తేజాన్ని పొందారో ఈ నవలలోని రాజు, సుశీలలు ఆ ఊరేగింపును చూసినప్పుడు అలాంటి ఉత్తేజాన్నే పొందారనిపిస్తుంది.

ఈనవల ముగిసేనాటికి మధ్యలోనే సుశీల చనిపోతుంది. రాజు మెట్రిక్యులేషన్ పరీక్షలు రాస్తాడు. వాయిల్పాడు గ్రామం నుండి మెట్రిక్ పరీక్షలు రాసిన మొట్టమొదటి విద్యార్థి రాజు. 'కాలరేఖలు' నాయికా నాయకులు ప్రధానమైన నవలకాదు. సమసమాజ స్థాపనకోసం ఓమానవసమూహం సాగించిన మహాప్రస్థానమే ఈ నవల. ఇది ఇంకా చీకటిలో మ్రగ్గుతున్న మానవ సమూహాలకు స్ఫూర్తిదాయకమైన గ్రంథం.

దౌర్జన్యం, దౌష్ట్యం కలకాలం సాగుతాయా? వాటిని ఎదిరించే శక్తులు సహజంగానే పుట్టుకొస్తాయి. మానవచరిత్ర యొక్క సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి ఏనాడూ నిరాశ, నిస్పృహలకు గురికాడు. 'కాలరేఖలు' నవల ఇచ్చే సందేశం ఇదే.

కాలమేసత్యం - కాలమే ఈశ్వరుడు. కాలమే సృష్టికి, స్థితికి, లయానికి మూలహేతువు. అన్ని రకాల ఒడిదుడుకులను కాలమే సరిచేస్తుంది. సర్వయాతనలకు కాలమే భేషజం. 'కాలరేఖలు'లో గర్భితమైన ఈ అర్థాన్ని పసిగట్టగలవాడే "క్రాంతదర్శి".

రోజుకో ముగ్గురు అమాయకుల్ని నిష్కారణంగా రైఫిల్‌తో కాల్చి చంపేవరకు నిదురపోని విస్నూరుదొర కొడుకు బాపు దొర దుర్మరణం ఆకతాయి కృత్యాలకు పాల్పడే ధూర్తులకు ఒక హెచ్చరిక. ఖాసింరజ్వీలాంటి మతోన్మాదులను కూడా చరిత్రలోని చెత్తబుట్టలో మీరు కలిసిపోక తప్పదని ఈ నవల హెచ్చరిస్తుంది.

"కాలరేఖలు"లో అడుగడుగునా అణచబడిన మానవ సమూహం దృగ్గోచరమౌతుంది. "అపమానిత మానవ విజయం కోసం చరిత్ర ఎదురుచూస్తోంది" అన్న రవీంద్రుని మాటను ప్రతీకాత్మక రూపంలో... అంటే "కాలరేఖలు" అనే నవలారూపంలో మనముందుంచాడు నవీన్. నవలాకారుడిగా ఆయన జన్మ ధన్యమైంది.

back to book of the week home page

❖ ఈ విశేష సమీక్షా వ్యాసం ట్రైస్టేట్ తెలుగు అసోసియేషన్ (చికాగో) వదాన్య సౌజన్యంతో అందించబడింది.